క్లుప్తంగా

నూకాంబిక ఆలయంలో శాంతి హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు శీకువాని పాలెంలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో గురువారం శాంతి హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

థ్రిఫ్ట్, రిటైర్‌మెంట్ ఫండ్స్‌పై 80 శాతం సెక్యూరిటీ లోన్



మహాజన సభలో మాట్లాడుతున్న థ్రిఫ్ట్ సొసైటీ కార్యదర్శి రామచంద్రమూర్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ థ్రిఫ్ట్ సొసైటీ సభ్యులకు ఉన్న థ్రిఫ్ట్ ఫండ్, రిటైర్‌మెంట్ ఫండ్‌పై 80 శాతం సెక్యూరిటీ లోన్‌గా ఇవ్వడానికి మహాజన సభ ఆమోదం తెలిపింది. స్థానిక సెక్టార్-1 స్టీల్‌క్లబ్‌లో జరిగిన థ్రిఫ్ట్ సొసైటీ 57వ మహాజన సభలో కార్యదర్శి డి. శ్రీరామచంద్రమూర్తి చేసిన ప్రతిపాదనకు సభ్యులు ఆమోదం తెలిపారు. సభ్యులకు సూపర్ యాన్యుయేషన్ ఫండ్‌గా ఏటా చెల్లిస్తున్న రూ.750 ను రూ. 850 చేస్తున్నట్టు ప్రకటించారు. కోశాధికారి కొండరాజు 2023-24 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కె. ఆనందకుమార్, డైరెక్టర్లు బి.లాలూ, ఎం.వి. రమణ, కర్రి శ్రీనివాస్, జి.వి. రమేష్, వి.జి. మహిధర్, సొసైటీ సీనియర్ మేనేజర్ కె. దామోదరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో మెగా పోస్టల్ మేళా

సీతంపేట: అక్కయ్యపాలెం సబ్ పోస్టాఫీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద పోస్టల్ మెగా మేళా నిర్వహించారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మేళాను ప్రారంభించి మాట్లాడారు. తపాలా శాఖ అనేక రకాల పొదుపు పథకాలను అందజేస్తోందన్నారు. ఆర్‌డీ, డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి పథకాల్లో ప్రజలు మదుపు చేసి అధిక లాభాలు, మీ డబ్బుకు పూర్తి రక్షణ పొందవచ్చని చెప్పారు. పోస్ట్‌మాస్టర్ ఏసు మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో గాని, మీ ఇంటికి ఉత్తరాలు బట్వాడా చేసే పోస్ట్‌మ్యాన్, ఉమెన్ ద్వారా ఇంటి వద్దే డబ్బు చెల్లించి పోస్టల్ పథకాల్లో డిపాజిట్ చేయవచ్చని తెలిపారు. పోస్టల్ శాఖ అందిస్తున్న పలు పొదుపు పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమాన్ని వెస్ట్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షించారు. అక్కయ్యపాలెం సబ్ పోస్టాఫీస్ సిబ్బంది, పోస్ట్‌మ్యాన్‌లు, పోస్ట్ ఉమెన్‌లు పాల్గొన్నారు.

జ్వరంతో చేర్పిస్తే రూ.2లక్షల బిల్లు వేశారు

కేర్ ఆస్పత్రిపై బాధితురాలి బంధువుల ఆరోపణ

మహారాణిపేట: టైఫాయిడ్ జ్వరంతో తన కుమార్తె(వైద్య విద్యార్థిని)ను విశాఖ కేర్ ఆస్పత్రిలో చేర్పిస్తే రూ.2లక్షల బిల్లు వేసి వేధిస్తున్నారని ఆమె తండ్రి జయరామ్ ఆరోపించారు. దీనిపై గురువారం ఆమె బంధువులు ఆందోళన చేపట్టి.. ఆస్పత్రి వర్గాలతో వాగ్వాదానికి దిగారు. ఆమె తండ్రి తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం రిమ్స్‌లో రేడియాలజీ విభాగంలో టి.స్పందన పీజీ చేస్తున్నారు. ఆమెకు జ్వరం రావడంతో ఈ నెల 26న రామ్‌నగర్‌లోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. నాలుగు రోజుల తర్వాత రూ.2లక్షల బిల్లు వేసి, చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. జ్వరం ఏమాత్రం తగ్గలేదని.. ఇంజక్షన్లు కూడా తెలియని కంపెనీలవి వేశారని అతను ఆరోపించారు. 'వైద్యం చేసిన తర్వాత కొద్ది రోజులకు నయం అవుతుంది. ఆస్పత్రిలో వైద్యం చేసుకోవడం ఇష్టం లేకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. బిల్లు ఇంకా చెల్లించలేదు' అని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.


కమనీయం.. సీతారాముల కల్యాణం

రఘువంశోత్తముడు రామయ్య.. సుగుణాల రాశి సీతమ్మల కల్యాణ మహోత్సవానికి నగరమంతా వేదికైంది. ఆకాశాన్నంటుతూ పందిళ్లు కొలువుదీరగా.. ఊరివారంతా పెళ్లి పెద్దలయ్యారు. చూసిన వారికి చూడముచ్చటగా అంగరంగ వైభవంగా సీతారాముల పరిణయ వేడుకను జరిపించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిపించిన ఈ ఉత్సవం చూసిన కనులదే భాగ్యమంటూ భక్తులంతా పరవశించారు. ముత్యాల తలంబ్రాలను అక్షతలుగా స్వీకరించారు.





షీలానగర్ ఎస్టీబీఎల్‌లో జరిపించిన కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు, వేడుకలో మాంగల్యాన్ని చూపుతున్న అర్చక స్వాములు



కాళింగవీధి రామాలయంలో సీతా, లక్ష్మణ సమేత శ్రీరాముడు

గాజువాక : శ్రీరామనవమి వేళ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. 70వ వార్డు డ్రైవర్స్ కాలనీలోని సీతా సమేత కోదండరామచంద్ర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జెడ్సీ పి.సింహాచలం, కార్పొరేటర్ ఉరుకూటి చందు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- 66వ వార్డు బీసీ రోడ్ ప్రాంతంలోని రామాలయంలో నిర్వహించిన వేడుకలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ పాల్గొన్నారు.
- పాత కర్ణవానిపాలెంలోని సీతా రాముల దేవాలయంలో కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, 72వ వార్డు కార్పొరేటర్ స్టాలిన్, తహసీల్దార్ చిన్నికృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
- **అక్కిరెడ్డిపాలెం:** 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ పాల్గొని సీతారాముల వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.
- 69వ వార్డు తుంగ్లాంలో కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. హరిజనజగ్గయ్యపాలెంలో గ్రామ నాయకులు కల్యాణం జరిపించారు.

ఎస్టీబీఎల్ ఆధ్వర్యంలో ..

షీలానగర్ ఎస్టీబీఎల్ సిటీ వరల్డ్ వద్ద ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ప్రాజెక్ట్స్ జీఎం జి.వి.కృష్ణయ్య దంపతుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఎస్టేట్ మేనేజర్ జి.గంగా మహేష్, గాంధీ పాల్గొన్నారు.

- **అగనంపూడి:** లంకెలపాలెం రామాలయంలో రాములోరి కల్యాణం రమణీయంగా జరిగింది. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.
- 85వ వార్డు బీసీ కాలనీ రామాలయంలో జరిపించిన కల్యాణ వేడుకలో తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి పాల్గొని పూజలు చేశారు. నక్కా రమణబాబు,ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు.



భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద సీతారాములను దర్శించుకుంటున్న దేవన్‌రెడ్డి దంపతులు

ఘనంగా ఉరుసు ఉత్సవం

అగనంపూడి షిర్డీ సాయిబాబా ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని ఉరుసు ఉత్సవం జరిపించారు. ప్రసాద్‌రెడ్డి దంపతులు, ఏఈటీఎఫ్ చైర్మన్ వై.రాంజీ మణి దంపతులు, ధర్మాల వ్యాసశర్మ దంపతులు కల్యాణం జరిపించారు.

- పాత దానబోయిపాలెం సీతారాముల ఆలయంలో కల్యాణం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి రహదారిలోని పురాతన ఆలయాన్ని జాబిలీహిల్స్ పరిసర ప్రాంతీయులు పునర్నిర్మించి, ఉత్సవాలను జరిపించారు. రవీంద్రరాజు హేమ, వేదవ్యాస్ దంపతులు కల్యాణం నిర్వహించారు.

పెదగంట్యాడ: 76వ వార్డు పరిధి నడుపూరు రామాలయంలో యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సీతాకల్యాణం జరిపించారు. సీతారాములను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ దర్శించుకున్నారు.

- దయాల్‌నగర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం జరిపించారు.
- వియ్యపువానిపాలెంలోని రామాలయంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వెంపళ్లనగర్ అధ్యక్షుడు గళ్లా శంకర్‌సాయిరాం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.
- దయాల్‌నగర్ పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా గల ఆలయంలో శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు.
- సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతిధామంలో ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు.
- బీసీ రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు కన్నేపల్లి సీతాపతి శర్మ నిర్వహించిన కల్యాణంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, ఎమిలీ జ్వాల దంపతులు, కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు పాల్గొన్నారు.
- 75వ వార్డు నెల్లిముక్కు రామాలయంలో నిర్వహించిన వేడుకలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పులి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **కూర్మన్నపాలెం:** 87వ వార్డు కణితికాలనీ కాళింగవీధిలో సీతారామాంజనేయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, దేవన్‌రెడ్డి, జెడ్సీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.
- 86వ వార్డు పాతకూర్మన్నపాలెంలోని కోదండరామాలయంలో కల్యాణం అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి దామా సుబ్బారావుపాల్గొన్నారు.
- **ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ సెక్టార్-1లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.
- స్థానిక హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో అధికసంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. ఏకాహం నిర్వహించారు.
- సత్యసాయి మందిరంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. కె.వి.ఎల్.ఎస్.రెడ్డి, ఆనంద్, వి. కృష్ణ బృందం భక్తి గీతాలు ఆలపించింది. సమితి కన్వీనర్ జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నడుపూరు రామాలయంలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



అగనంపూడి సాయిబాబా ఆలయంలో ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



వియ్యపువానిపాలెంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి



నడుపూరు రామాలయంలో కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు



70వ వార్డులో పల్లకీ సేవ నిర్వహిస్తున్న కార్పొరేటర్ చందు తదితరులు



పాతకర్ణవానిపాలెంలో భక్తులకు శతమానం చూపుతున్న ఆగమ పండితులు



ఉక్కు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



ఉక్కు సత్యసాయి మందిరంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



87వ వార్డులో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న భక్తులు

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 73వ వార్డు సమతానగర్ జంక్షన్‌లో రూ.19.95లక్షలతో నిర్మించనున్న వరద నీటి కాలువ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ భూపతిరాజు సుజాత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి వార్డుకు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో చిన్న వానకే కాలువలు పొంగిపోతున్నాయని, రోడ్లపైకి మురుగు వస్తోందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో, ఆమె ఎమ్మెల్యేకు సమస్య వివరించి నిధులు కేటాయించేలా కృషి చేశారు. సమస్య పరిష్కారం కానుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భూపతిరాజు శ్రీనివాసరాజు, వైవీ రమణ, సత్యనారాయణ, కులుకూరి మంగరాజు, మొగలపల్లి త్రిమూర్తులు, రంబ నారాయణమూర్తి, గొందేశి వెంకటరమణారెడ్డి, కేపీ నాయుడు, లక్ష్మణరావు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికుల భవిష్యత్తు అంధకారం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేస్తూ కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 777వ రోజు గురువారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి ఇస్తే కార్మికుల భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నిబద్ధత గల నాయకుడు సీఎం జగన్

- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 68వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

అక్కిరెడ్డిపాలెం: ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్న నిబద్ధత గల నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 68వ వార్డు మిందిలో గురువారం ఆయన కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలిసి పర్యటించారు. ప్రతీ ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మహిళలకు వర్తించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బ్రోచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపించే నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మహిళలు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించి, అన్ని రంగాల్లో వారికి విశేష ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో దళితులపై, ముఖ్యంగా మహిళలపై జరిగిన దాడులను ప్రతీ ఒక్కరు గుర్తు చేసుకోవాలన్నారు. చంద్రబాబు చేస్తున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రాన్ని నాశనం చేయడానికి ఒకపక్క చంద్రబాబు, మరో వైపు పవన్ కల్యాణ్ కుట్రలు చేస్తున్నారన్నారు. పదవీకాంక్షతో పరితపిస్తూ రాష్ట్రాన్ని దోచుకోవడానికి మాత్రమే వీరు జగన్‌పై మూకుమ్మడి దాడి చేస్తున్నారని ఆరోపించారు. సీఎం జగన్ మాత్రం ప్రజల సంక్షేమం కోరుతూ ధైర్యంగా పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. ఆయనకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను సంబంధిత సచివాలయ సిబ్బందితో మాట్లాడి పరిష్కారానికి ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర, నాయకులు రొక్కం వెంకట్రావు, ఈటి సురేష్, శ్రీహరి, వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, నంబారు రాజు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్, సీవో సుధారాణి, ప్రసాద్, వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఘనంగా పుట్ట బంగారు మహోత్సవం

అమ్మవారికి జలాభిషేకం చేసేందుకు పోటీ పడిన భక్తులు

అగనంపూడి: అగనంపూడి అష్ట గ్రామాల ఆరాధ్య దైవం బొర్రమాంబ అమ్మవారి పుట్ట బంగారు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బొర్రమ్మ వనంలోని అమ్మవారిని భారీ ఊరేగింపుగా వేలాది మంది భక్తులు తీసుకు వెళ్లారు. బళ్ల వేషాలు, నేల వేషాలు, తప్పెటగుళ్లు, కోలాటాలు భారీ మందుగుండు సామగ్రి పేల్చి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అమ్మవారి ఊరేగింపు వెళ్లే మార్గంలో దారి పొడవునా మహిళలు రహదారులను పరిశుభ్రం చేసి, తోడ్కొని వెళ్లారు. అమ్మవార్ని మోసేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా అమ్మవారి వనం నుంచి గ్రామం వరకు సుమారు కిలో మీటరు దూరం వరకు రహదారులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పుట్ట బంగారాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు



అమ్మవారికి జలాభిషేకం చేయడానికి నీళ్ల బిందెలతో వేచి ఉన్న మహిళలు

రోడ్డెక్కిన మురుగు



మింది వెళ్లే రోడ్డులో రోడ్డుపైకి చేరిన మురుగు నీరు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఏ-బ్లాక్ మింది వైపు వెళ్లే రోడ్డులో మురుగు నీరు రోడ్డుపైకి చేరడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోనగర్ ఏ బ్లాక్ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న రాజీవ్‌నగర్, కాళికానగర్, గిరిప్రసాద్ నగర్ కాలనీ ప్రాంతాలకు డ్రైనేజీ లేకపోవడంతో, కాలువలు నిండిపోయి పల్లంగా ఉన్న ఏ బ్లాక్‌లో మురుగు రోడ్డుపైకి వచ్చి చేరుతుంది. దీనికి తోడు ఏ బ్లాక్‌లో రోడ్డు పక్కన డ్రైనేజీల నిర్మాణాలు జరుగుతుండటంతో కాలువలను బ్లాక్ చేస్తున్నారు. దీంతో రోడ్డు పక్కన భారీగా మురుగు నీరు నిలిచిపోయి తీవ్ర దుర్గంధంతో పాటు రోడ్డుపైనే చేరడంతో ఆ మార్గంలో ప్రయాణమంటేనే వాహనచోదకులు హడలిపోతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.